# యథేచ్ఛగా మట్టి తవ్వకాలు

- ఎలాంటి అనుమతుల్లేకుండా హైవే రోడ్డు కోసం మట్టి తవ్వకం
- పట్టించుకోని రెవెన్యూ, మైనింగ్ అధికారులు
- నిబంధనలు బేఖాతర్


రామసముద్రం వద్ద మట్టిని తవ్వుతున్న ప్రొక్లెయిన్


మట్టిని తరలిస్తున్న టిప్పర్లు

**జూపాడుబంగ్లా:** నేషనల్ హైవే–340సీ రోడ్డు నిర్మాణం కోసం పీఎస్‌కే కంపెనీ వారు ఇష్టానుసారంగా మట్టి తవ్వకాలు చేస్తున్నా రెవెన్యూ, మైనింగ్ శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో పలు విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. మండల పరిధిలోని మండ్లెం, తరిగోపుల రెవెన్యూ పరిధిలోని రామసముద్రం గ్రామాల్లో రెవెన్యూ, మైనింగ్ అధికారుల అనుమతుల్లేకుండా రైతులకు ప్రభుత్వం ఇచ్చిన భూముల్లో యథేచ్ఛగా మట్టిని తవ్వి రోడ్డు నిర్మాణం కోసం తరలిస్తున్నారు. నిబంధనల ప్రకారం మట్టితవ్వకాల కోసం మండల తహసీల్దార్ వద్ద ఎన్‌ఓసీ తీసుకోవాలి. తర్వాత మైనింగ్ అధికారులకు నిర్ణీత కొలతల ప్రకారం రుసుము చెల్లించి వారి అనుమతి పొందిన తర్వాతనే మట్టి తవ్వకాలు చేయాల్సి ఉంటుంది. అదికూడా పర్యావరణానికి, చుట్టుపక్కల రైతులకు అటంకం కలిగించకుండా కేవలం ఒక మీటరులోతు మాత్రమే మట్టిని తవ్వాల్సి ఉంటుంది. అయితే పీఎస్‌కే కంపెనీ వారు రెవెన్యూ, మైనింగ్ అధికారుల అనుమతుల్లేకుండా ఇష్టానుసారంగా రైతులకు చెందిన ప్రభుత్వ భూముల్లో మూడు మీటర్ల లోతు మేర మట్టిని తవ్వి రోడ్డు నిర్మాణానికి వినియోగిస్తున్నారు. కళ్లెదుటే ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇష్టానుసారంగా ప్రభుత్వ భూముల్లో మట్టిని తవ్వి తరలిస్తున్న పీఎస్‌కే కంపెనీ వారిపై చర్యలు తీసుకొని అక్రమ మట్టి తవ్వకాలను అరికట్టాలని స్థానిక రైతులు కోరుతున్నారు.

### అక్రమ తవ్వకాలపై చర్యలు తీసుకోవాలి



పీఎస్‌కే కంపెనీ వారు ఎలాంటి అనుమతుల్లేకుండా ప్రభుత్వ భూముల్లో ఇష్టానుసారంగా మట్టిని తవ్వి భారీ వాహనాల్లో తరలిస్తున్నారు. దీంతో రోడ్డు దెబ్బతినడంతో పాటు వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. రెవెన్యూ, మైనింగ్ అధికారులు మామూళ్ల మత్తులో అక్రమ మట్టి తవ్వకాలపై చర్యలు తీసుకోవడం లేదు. వెంటనే అధికారులు చర్యలు తీసుకొని అక్రమ మట్టి తవ్వకాలను నివారించకపోతే సీపీఐ తరఫున ఆందోళనలు చేపడతాం.
– రమేష్, సీపీఐ నాయకుడు

### మట్టి తవ్వేందుకు అనుమతులివ్వలేదు



మండల పరిధిలో రైతులకు ఇచ్చిన ప్రభుత్వ భూముల్లో మట్టిని తవ్వేందుకు ఇప్పటిదాకా ఎవ్వరికీ అనుమతులు ఇవ్వలేదు. మట్టి తవ్వుతున్నట్లు ఇప్పటిదాకా నా దృష్టికి రాలేదు. పరిశీలించి అక్రమంగా మట్టిని తవ్వుతున్న వారిపై చర్యలు తీసుకుంటాం. అక్రమ మట్టి తవ్వకాలను నిలువరిస్తాం.
– బాబూరాజేంద్రప్రసాద్, తహసీల్దార్, జూపాడుబంగ్లా

## క్లుప్తంగా

### తాగునీరు కలుషితం కాలేదు


ట్యాంకు వద్ద పరిశీలిస్తున్న డీఈఈ విద్యాసాగర్

**పాములపాడు:** మండలంలోని మిట్టకందాల గ్రామంలో ప్రజలు అతిసారా వ్యాధి బారిన పడటానికి తాగునీరు కారణం కాదని డీఈ విద్యాసాగర్ అన్నారు. మంగళవారం గ్రామంలోని ఓహెచ్‌ఎస్‌ఆర్, నీటి ట్యాంకులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి శాంపిల్స్‌ను ల్యాబ్‌లో పరీక్షించగా ఎలాంటి బ్యాక్టీరియల్ కంటామినేషన్ లేదని స్పష్టమైందన్నారు. ఎస్సీ కాలనీలో లీకైన పైపులైన్‌కు 4 రోజుల క్రితమే మరమ్మతులు చేయించినట్లు చెప్పారు. ప్రజల ఆరోగ్యం దృష్ట్యా గ్రామంలో మినరల్ వాటర్‌ను సరఫరా చేయాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. ప్రజలు వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలని సూచించారు. ఏఈ అనిల్‌చంద్ర ఉన్నారు.

### శారదా పీఠంలో ఎమ్మెల్యే దంపతులు


ఎమ్మెల్యే దంపతులను ఆశీర్వదిస్తున్న పీఠాధిపతి శివయోగేంద్ర సరస్వతి స్వామి

**మహానంది:** బండిఆత్మకూరు మండలం కాకనూరు గ్రామంలోని శారదాపీఠంలో శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి దంపతులు మంగళవారం పూజలు నిర్వహించారు. ముందుగా పీఠంలో కొలువైన శారదా అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం శారదాపీఠం పీఠాధిపతి శివయోగేంద్ర సరస్వతి స్వామి వారు ఎమ్మెల్యే బుడ్డా దంపతులకు స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి ఆశీర్వచనాలు చేశారు. అలాగే ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి దంపతులు ఓంకారం ఆలయానికి చేరుకుని గంగ, ఉమా సమేత ఓంకార సిద్ధేశ్వరస్వామి వారిని దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు.

### తప్పిన పెనుప్రమాదం


స్వల్ప గాయాలతో బయటపడిన మహిళ

**పాములపాడు:** స్థానిక బస్టాండ్ సమీపంలోని చెలిమిల్ల రస్తా మలుపులో బైక్ పైనుంచి కింద పడిన మహిళకు పెను ప్రమాదం తప్పింది. వివరాలు.. మండలంలోని యర్రగూడూరు గ్రామానికి చెందిన భిక్షపతి తన భార్య సుజాతతో కలిసి బైక్‌పై బట్టల వ్యాపారం చేస్తుంటారు. ఈ క్రమంలో మంగళవారం చెలిమిల్ల రస్తా నుంచి మలుపు తిరుగుతుండగా బైక్ స్కిడ్ కావడంతో కిందపడ్డారు. వెనక కూర్చున్న సుజాత రోడ్డుపై పడిపోగా వెనుక వచ్చిన ట్రిప్పర్ డ్రైవర్ అప్రమత్తమై సడన్‌బ్రేక్ వేశాడు. క్షణాల్లో ట్రిప్పర్ ముందు చక్రం ఆమెకు దగ్గరగా వచ్చి ఆగింది. దీంతో పెను ప్రమాదం తప్పినట్లైంది. రోడ్డుపై పడడంతో తలకు స్వల్ప గాయమైంది. అక్కడే ఉన్న ఆర్‌ఎంపీ వైద్యుడు లక్ష్మినారాయణ ప్రథమ చికిత్స అందించగా అనంతరం వైద్యశాలకు వెళ్లారు.


### అలరించిన గాత్ర కచేరి



గాత్రకచేరి నిర్వహిస్తున్న బృంద సభ్యులు

**శ్రీశైలంటెంపుల్:** శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వద్ద నెల్లూరుకు చెందిన మల్లాది అనూష, బృందం గాత్రకచేరి ఆకట్టుకుంది. శివ శివ శంభో, కాలభైరావాష్టకం, ఆనందామృత, విజయాంబికే, సకల మంత్రముల, అంబావాణీ, గౌరీ మనోహర, వినాయకుని వలెను, జయజయదేవి, మహిషాసురమర్దిని, శ్రీ చక్రరాజ సింహాసనేశ్వరి, కైలాసగిరి వాసా, కాళింగనర్తన, దుర్గాదేవి దురితనివారిణి, కామకోటిపీఠవాసిని తదితర గీతాలను అష్టకాలను మల్లాది అనూష తదితరులు ఆలపించారు.

### సమస్యల పరిష్కారానికి కృషి


లింగాపురంలో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి

**మహానంది:** గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి తెలిపారు. బండిఆత్మకూరు మండలం లింగాపురం, సంతజూటూరు గ్రామాల్లో మంగళవారం ఓట్ ఆఫ్ థాంక్స్ కార్యక్రమంలో భాగంగా ప్రజలతో మాట్లాడారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బాబు, పరశురాం, హేమసుందర్‌రెడ్డి, వెంగళరెడ్డిపేట శ్రీనివాసులు, వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

### 5న మండల సర్వసభ్య సమావేశం

**జూపాడుబంగ్లా:** ఈ నెల 5వ తేదీన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నూర్జహాన్ తెలిపారు. ఆమె మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ.. ఎంపీపీ సువర్ణమ్మ అధ్యక్షతన సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు. వివిధ శాఖలకు చెందిన మండలస్థాయి అధికారులు ప్రగతి నివేదికలతో సమావేశానికి హాజరుకావాలని సూచించారు. అలాగే ఆయా శాఖలకు చెందిన ప్రగతి నివేదికల రిపోర్టును ఈ నెల 4వ తేదీ సాయంత్రంలోగా ఎంపీడీఓ కార్యాలయంలో సమర్పించాలన్నారు.

### ఉపాధ్యాయులకు బకాయిలు చెల్లించాలి

**జూపాడుబంగ్లా:** ఉపాధ్యాయులకు వెంటనే సీపీఎఫ్, ఆర్జిత సెలవుల బకాయిలు వెంటనే చెల్లించాలని పీఆర్‌టీయూ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ డి.జాకీర్‌హుసేన్ కోరారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు ఇప్పటిదాకా పెండింగ్‌లో ఉన్న సీపీఎఫ్, సంపాధిత సెలవుల బకాయిల మొత్తాన్ని వెంటనే చెల్లించి ఇబ్బందుల్లో ఉన్న వారిని ఆదుకోవాలని ఆయన కోరారు.

## అధ్యాపకుడిపై చర్యలు తీసుకోవాలి


ప్రిన్సిపాల్‌కు వినతి పత్రం అందజేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

**ఆత్మకూరు:** విద్యార్థి ఎస్.బాబుపై దాడి చేసిన జీఎఫ్‌సీ అధ్యాపకుడు సుధాకర్‌పై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ, ఐసా, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం వారు ప్రిన్సిపాల్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జునైద్‌బాషా, ఏఐఎస్‌ఏ జిల్లా కార్యదర్శి నాగార్జున, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షులు దినేష్ మాట్లాడుతూ స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎంఅండ్ ఏటీ ద్వితీయ సంవత్సరం విద్యార్థి ఎస్.బాబును జీఎఫ్‌సీ లెక్చరర్ సుధాకర్ బూతులు తిడుతూ దాడి చేయడం తగదన్నారు. అధ్యాపకుడు ప్రతిసారీ డబుల్ మీనింగ్ వచ్చేలా మాట్లాడతారని, ఆయన ప్రవర్తన సరిగా లేదని ఆరోపించారు. విద్యాబుద్ధులు నేర్పాల్సిన గురువే అందరి ముందు ఓ విద్యార్థిని అసభ్యకర పదజాలంతో తిట్టడం పద్ధతి కాదన్నారు. అధ్యాపకుడిపై చర్యలు తీసుకోకపోతే ఆందోళనలకు దిగుతామని వారు హెచ్చరించారు.

### నేడు 'నందీశ్వరుడి'కి ప్రదోషకాల అభిషేకం

**మహానంది:** మహానందిలో కొలువైన మహానందీశ్వరస్వామి ఆలయం ఎదురుగా ఉన్న నందీశ్వరస్వామికి బుధవారం ప్రదోషకాలంలో అభిషేకం పూజలు నిర్వహించనున్నట్లు వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మాసోత్సవాల్లో భాగంగా జ్యేష్ఠ బహుళ త్రయోదశి, మహాప్రదోష కాలంలో సాయంత్రం నాలుగు గంటలకు అభిషేకం ఉంటుందన్నారు. ఆర్జిత సేవల్లో పాల్గొనాల్సిన భక్తులు గంట ముందుగానే ఆలయంలోకి రావాలని విజ్ఞప్తి చేశారు.

## ఆహార భద్రత అధికారుల తనిఖీ


వంట నూనె శాంపిల్‌ను సేకరించిన అధికారులు

**నందికొట్కూరు:** స్థానిక కాలేజీ సెంటర్‌లోని పాండు హోటల్‌లో కల్తీ నూనెతో ఆహారం తయారు చేస్తున్నట్లు ఓ వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు దాడులు నిర్వహించినట్లు ఫుడ్ సేఫ్టీ జిల్లా అధికారులు వెంకటరాముడు, ఖాసీంవలి తెలిపారు. మంగళవారం పట్టణంలోని నంద్యాల రోడ్డు కాలేజీ సెంటర్‌లోని పాండు హోటల్‌ను తనిఖీ చేశారు. నిల్వ ఉన్న సరుకులు, వంటనూనెను పరిశీలించారు. ల్యాబ్ టెస్టింగ్ కోసం నూనెతో పాటు మరికొన్ని సరుకుల శాంపిల్స్ తీసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నాణ్యత లేని సరుకులతో తయారు చేసిన ఆహార పదార్థాలు తింటే ప్రజలు రోగాల బారిన పడతారన్నారు. కల్తీ నూనెలతో ఆహారం తయారు చేసినట్లు తేలితే హోటళ్లను సీజ్ చేయడం ఖాయమని హెచ్చరించారు. ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీసే నూనెలతో వంటకాలు తయారు చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. త్వరలోనే పట్టణంలోని అన్ని హోటళ్లను తనిఖీ చేస్తామన్నారు.

## నీట్ లీకేజీ కారకులపై చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న విద్యార్థి జేఏసీ నాయకులు

**నందికొట్కూరు:** నీట్ పశ్నాపత్రం లీకేజీకి కారణమైన వారిపై బీజేపీ ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని విద్యార్థి జేఏసీ నాయకులు ఆది, రంగస్వామి, దినేష్ ప్రశ్నించారు. మంగళవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బీజేపీ అసమర్థ పాలనలో ప్రతిష్ఠాత్మకమైన నీట్, నెట్ ప్రశ్నాపత్రాలు లీకేజీ కావడం సిగ్గుచేటన్నారు. బీజేపీ పాలనలో 62 సార్లు పేపర్ లీకేజీ అయినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంలో అంతర్యమేమిటని ప్రశ్నించారు. ప్రశ్నాపత్రం లీక్ చేసి కోట్లు సంపాదించుకుని విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి నిరసనగా ఈ నెల 4వ తేదీన తలపెట్టిన విద్యాసంస్థల బంద్‌కు అందరూ సహకరించాలని కోరారు.

### కోలుకోలేక వ్యక్తి మృతి

**ఆళ్లగడ్డ:** మండలంలోని బాచ్చాపురం గ్రామానికి చెందిన చంద్రశేఖర్(46) వైద్యశాలలో చికిత్స పొందుతూ కోలుకోలేక మంగళవారం రాత్రి మృతి చెందాడు. రూరల్ ఎస్‌ఐ నరసింహులు తెలిపిన వివరాల మేరకు కుటుంబ కలహాలతో సోమవారం రాత్రి చంద్రశేఖర్ పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు నంద్యాల తరలించగా అక్కడ ప్రాథమికి చికిత్స అనంతరం కర్నూలు వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు చెప్పారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

## 'ప్రతిపక్షాలను అణచివేసేందుకే కొత్త చట్టాలు'



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు రమేష్‌కుమార్

**నందికొట్కూరు:** ప్రతిపక్షాలను అణచివేసేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కొత్త చట్టాలను తెచ్చిందని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు రమేష్‌కుమార్ ఆరోపించారు. ఆయన మంగళవారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. కొత్త చట్టాలు ప్రజలకు హానికరంగా ఉన్నాయని చెప్పారు. నూతన చట్టాలను బీజేపీ ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో 146 మంది ప్రతిపక్ష ఎంపీలను బలవంతంగా సస్పెండ్ చేసి ఏకపక్షంగా చట్టాలను తీసుకొచ్చారని గుర్తు చేశారు. గత పార్లమెంట్ సమావేశాల సందర్భంగా దుండగులు చొరబడి అలజడి సృష్టించారని, పార్లమెంట్ సభ్యులకే రక్షణ కరవైందని ఇక దేశ ప్రజలకు రక్షణ ఎంత వరకు ఉంటుందని ప్రశ్నించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేయకుండా బీజేపీ ద్రోహం చేసిందని మండిపడ్డారు. కార్మిక ఉద్యమాలను అణచివేసేందుకు రాజ్యాంగ వ్యవస్థలను ధ్వంసం చేయడం తగదన్నారు. నూతన చట్టాలను విరమించుకోకపోతే ఆందోళన చేపట్టక తప్పదన్నారు. సీపీఎం నాయకులు నాగేశ్వరరావు, ఫక్కీర్ సాహెబ్, గోపాలకృష్ణ, శ్రీనివాసులు, జయరాం, తదితరులు పాల్గొన్నారు.

### నేడు సగర సంఘం నూతన కమిటీ ఏర్పాటు

**బొమ్మలసత్రం:** నంద్యాల జిల్లా సగర సంఘం నూతన కమిటీని బుధవారం ఏర్పాటు చేయనున్నట్లు కర్నూలు ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పరి సురేష్‌కుమార్ తెలిపారు. నంద్యాల నియోజకవర్గ కమిటీ అధ్యక్షుడు బోయిని బాలాజీ ఆధ్వర్యంలో మంగళవారం కరపత్రాలు పంపిణీ చేశారు. నంద్యాల జిల్లాగా ఏర్పాటైన నేపథ్యంలో జిల్లా కమిటీని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. స్థానిక జంబులా పరమేశ్వరి దేవాలయంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి జిల్లా సగరులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు టీవై శివయ్య, టీచర్ సుబ్బరాయుడు, ఎల్‌వీసీ వెంకటేశ్వర్లు, చిన్నయ్య, వెంకటరాముడు, రామకృష్ణ, రామపుల్లయ్య, నవీన్, ఉపేంద్ర పాల్గొన్నారు.

## అతిసార వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి


అవగాహన కల్పిస్తున్న డాక్టర్ భావనరెడ్డి

**మహానంది:** అతిసార వ్యాధిపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, వాంతులు, విరేచనాలు అయితే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యసేవలు పొందాలని బండిఆత్మకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎ.భావనరెడ్డి తెలిపారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఆశ కార్యకర్తలకు మంగళవారం అవగాహన కల్పించారు. డాక్టర్ భావనరెడ్డి మాట్లాడుతూ అతిసార వ్యాధి నుంచి చిన్నపిల్లలను రక్షించాలన్నారు. చిన్నారుల్లో అతిసారం లక్షణాలు గుర్తిస్తే తల్లిదండ్రులు వెంటనే జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ, వీహెచ్‌ఎస్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

### పెరిగిన ఆదాయం


వేలంపాట నిర్వహిస్తున్న ఈఓ చంద్రుడు

**దొర్నిపాడు:** మండలంలోని క్రిష్టిపాడు గ్రామం మాన్యం భూముల వేలం పాటల్లో ఆలయాలకు రూ.1.53లక్షల ఆదాయం వచ్చినట్లు ఈఓ చంద్రుడు తెలిపారు. మంగళవారం శ్రీనాగేశ్వరస్వామి ఆలయానికి సంబంధించి 25.62, శ్రీచెన్నకేశవ స్వామి ఆలయానికి చెందిన 26.42 ఎకరాల మాన్యం భూములను వేలం పాటలు నిర్వహించారు. ఈసందర్భంగా 11.73లక్షలకు వేలంపాడి పొలాలను కౌలుకు దక్కించుకున్నారు. గతేడాదితో పోలిస్తే రూ.1.53లక్షల ఆదాయం వచ్చినట్లు ఈఓ చెప్పారు.

### ధర్మాన్ని పాటిస్తే దైవానుగ్రహం

**గోస్పాడు:** ధార్మిక వ్యాప్తితో సమాజంలో శాంతి నెలకొంటుందని తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకుడు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి అన్నారు. మంగళవారం గోస్పాడులోని సోమనందీశ్వరస్వామి ఆలయంలో నాలుగు రోజుల ధార్మిక కార్యక్రమాలను ప్రారంభించారు. ఇస్కాన్ ధర్మ ప్రచారకులు నిత్యతృప్త దాస్ శ్రీమద్రామాయణంపై ప్రవచనాలు చేశారు. ధర్మ రక్షణ ప్రతి మానవుని కర్తవ్యమని, ధర్మాన్ని పాటించినప్పుడే దైవానుగ్రహం కలుగుతుందని తెలిపారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సోమనందీశ్వరస్వామి దేవస్థానం వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీకంఠ నందీశ్వరశర్మ, సర్పంచ్ పరదేశి ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

### శాస్త్రోక్తంగా ఏకాదశి ఉత్సవం


ఉత్సవమూర్తులకు తిరుమంజనం నిర్వహిస్తున్న దృశ్యం

**ఆళ్లగడ్డ :** ప్రముఖ పుణ్యక్షేత్రం అహోబిలం లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో పంచప్రవ ఏకాదశిని పురస్కరించుకుని మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున మూలమూర్తులను శుప్రభాతసేవతో మేలుకొలిపి దివ్యదర్శనం అనంతరం నిత్యపూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేత ప్రహ్లాదవరదస్వాములను అద్దాల మండపంలో కొలువుంచి పంచామృతాలతో అభిషేకించి వేద మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల మధ్య దూపదీపాలతో మహా మంగళహారతి అందించారు. రాత్రి విశేష అలంకరణలో స్వామి,అమ్మవార్లు పల్లకీపై కొలువుదీరి తిరువీధిలో విహరించారు.

## సాగునీటి పథకాల మంజూరుకు కృషి చేస్తాం


విద్యార్థులకు బ్యాగు, యూనిఫాం అందజేస్తున్న ఎమ్మెల్యే జయసూర్య, మాండ్ర శివానందరెడ్డి

**జూపాడుబంగ్లా:** మండలానికి నూతన లిఫ్టు ఇరిగేషన్ పథకాలు మంజూరయ్యేలా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళతామని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, టీడీపీ పార్లమెంటు ఇన్‌చార్జ్ మాండ్రశివానందరెడ్డి తెలిపారు. మంగళవారం జూపాడుబంగ్లా ఎఫ్‌పీఓ కార్యాలయంలో నిర్వహించిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో వారు అతిథులుగా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ.. శ్రీశైలం బ్యాక్‌వాటర్‌కు అనుసంధానంగా రెండు లిఫ్టు ఇరిగేషన్ పథకాలు ఏర్పాటు చేయించి మండలంలోని 30 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తామన్నారు. పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్‌తో మాట్లాడి తంగడంచ ఫారం భూముల్లో పరిశ్రమలను ఏర్పాటు చేయించి నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పనకు కృషి చేస్తామన్నారు. అనంతరం లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. సర్పంచ్ మొట్టె బాలయ్య, ఎంపీటీసీ మోతె వెంకటమ్మ, ఎంపీపీ సువర్ణమ్మ, తహసీల్దార్ బాబూ రాజేంద్రప్రసాద్, ఎంపీడీఓ నూర్జహాన్, ఏసీ డేగలయ్య, ఏపీఎం అంబమ్మ, నాయకులు రమణారెడ్డి, గుండ్రెడ్డి మోహన్‌రెడ్డి, పిక్కిలి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

**బావిభారత పౌరులుగా తీర్చిదిద్దాలి**

విద్యార్థులకు మంచి విద్యాబుద్ధులు నేర్పించి వారిని బావిభారత పౌరులుగా తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే జయసూర్య ఉపాధ్యాయులకు సూచించారు. మంగళవారం జూపాడుబంగ్లా మోడల్ స్కూల్లో విద్యార్థులకు బ్యాగులు, యూనిఫారంలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన చేసి మెరుగైన ఫలితాలు సాధించాలన్నారు. ప్రిన్సిపాల్ రమేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**కొత్తపల్లి:** మండల పరిధిలోని ఎర్రమఠం, కొత్తపల్లి గ్రామాలలో ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, నంద్యాల పార్లమెంట్ ఇన్‌చార్జ్ మాండ్ర శివానంద రెడ్డి పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ.. ఒక్కరోజులోనే 95 శాతం పింఛన్ల పంపిణీ చేయడం జరిగిందన్నారు. అలాగే మండలంలో నూతన ఎత్తిపోతల పథకాల ఏర్పాటుకు, రైతులకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం సీఎం, డీప్యూటీ సీఎం చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఎంపీడీఓ జవహర్ బాబు, తహసీల్దార్ తిరుపతయ్య, సర్పంచులు లక్ష్మిదేవి, చంద్రశేఖర్ యాదవ్, బాలఎల్లయ్య, మశమ్మ, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

**పాములపాడు:** రాష్ట్రంలో సంక్షేమాభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పెద్ద పీట వేస్తున్నారని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, టీడీపీ నంద్యాల పార్లమెంట్ ఇన్‌చార్జ్ మాండ్రశివానందరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో మండలంలోని 5 గ్రామ పంచాయతీలకు మంజూరైన ట్రాక్టర్లను ప్రారంభించారు. ఎస్సీ కాలనీలో పింఛన్లను పంపిణీ చేశారు. అనంతరం స్థానిక సర్వసభ్య సమావేశ భవనంలో మాట్లాడుతూ.. స్థానిక సమస్యల పరిష్కారానికి, నియోజకవర్గ అభివృద్ధికి పాటు పడతామని పేర్కొన్నారు. ఎంపీడీఓ సరస్వతి, తహసీల్దార్ వెంకటరమణ, సర్పంచ్‌లు మేకల భాగ్యమ్మ, మౌలాలి, మంగమ్మబాయి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## మొరాయిస్తున్న సర్వర్



కంప్యూటర్ ఆపరేటర్‌ను ప్రశ్నిస్తున్న దరఖాస్తుదారులు


తహసీల్దార్ కార్యాలయంలో గుమిగూడిన దరఖాస్తుదారులు

- కులం, ఆదాయం, ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ల జారీలో జాప్యం
- పేరుకుపోయిన దరఖాస్తులు
- ఆందోళన చెందుతున్న విద్యార్థులు

**నంద్యాల(అర్బన్):** స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తులను అప్‌లోడ్ చేసే సర్వర్ మొరాయిస్తుండడంతో కుల, ఆదాయ, ఈబీసీ, ఈడబ్ల్యూఎస్ ధ్రువీకరణ పత్రాల జారీ ప్రక్రియ నిలిచిపోయింది. దరఖాస్తులు పేరుకుపోయాయి. ఇటీవల పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, పాలిటెక్నిక్ కళాశాలల్లో చేరడంతో పాటు ఎంసెట్, ట్రిపుల్ ఐటీ తదితర పరీక్షలు రాసిన విద్యార్థులు ఆయా కోర్సుల్లో చేరేందుకు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అవసరం ఉంది. నోటిఫికేషన్ రాకముందే దరఖాస్తు చేసుకున్నా ఇంత వరకు ఈబీసీ, ఈడబ్ల్యూఎస్, కులం సర్టిఫికెట్లు చేతికి అందకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ఈనెల 4వ తేదీ నుంచి కౌన్సెలింగ్‌లు ప్రారంభమవుతుండడంతో ఏం చేయాలో తెలియక కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. దరఖాస్తులను అప్‌లోడ్ చేసే జూనియర్ అసిస్టెంట్ జనార్దన్ ఇటీవల అనారోగ్యానికి గురికావడంతో సోమవారం నుంచి మరో కంప్యూటర్ ఆపరేటర్‌ను ఏర్పాటు చేశారు. అయితే సర్వర్ మొరాయింపుతో దరఖాస్తులను అప్‌లోడ్ చేస్తున్నా విఫలం అవుతున్నాయి. దీంతో దరఖాస్తుదారులకు ఎదురు చూపులు తప్పడం లేదు. 15 రోజులుగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉండడంతో విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరమవుతుందని, అధికారులు స్పందించి సర్వర్ సక్రమంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## కొత్త చట్టాలపై న్యాయవాదులకు అవగాహన


కొత్త చట్టాలపై అవగాహన కల్పిస్తున్న జడ్జి వాసు

**నంద్యాల(వ్యవసాయం):** న్యాయ వ్యవస్థలో కీలక మార్పులు చేస్తూ కేంద్రం తెచ్చిన కొత్త క్రిమినల్ చట్టాలపై నంద్యాల కోర్టులో రెండో రోజు మంగళవారం న్యాయవాదులు, పోలీసులకు అవగాహన కల్పించారు. ఐపీసీ, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ స్థానంలో భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్షా సంహిత, భారతీయ సాక్ష్య అధినియం అమలు అవుతాయన్నారు. మండల లీగల్ సెల్ ఆధ్వర్యంలో న్యాయమూర్తులు వాసు, రాధారాణి, ఏసురత్నం, ఆదినారాయణ శిక్షణ తరగతులు నిర్వహించారు. పిల్లలను కొనడం అమ్మడం కొత్త చట్టాల ప్రకారం తీవ్రమైన నేరం అని తెలిపారు. మైనర్‌పై సామూహిక అత్యాచారం చేస్తే జీవిత ఖైదు లేదా మరణ శిక్ష పడుతుందని పేర్కొన్నారు. క్రైం అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ సిస్టమ్‌ను దేశ వ్యాప్తంగా అన్నీ పోలీస్‌స్టేషన్లకు అనుసంధానం చేస్తారన్నారు. కార్యక్రమంలో సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రామిరెడ్డి గారి రాంభూపాలరెడ్డి, శ్రీనివాసులు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, భూపాని వెంకటేశ్వర్లు, వివేకానందరెడ్డి, జగన్‌మోహన రెడ్డి, కృష్ణలింగయ్య తదితరులు పాల్గొన్నారు.